Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి సెల్ : 9440815774

Editor : Dama Vijaya Kumar | Volume : 6 | issue: 342 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :342 | శనివారం 13 డిసెంబర్ 2025 | వెల : 3 | పేజీలు : 4



## భూకంపాల నివారణ కోర్టు పనా?

- పిటిషనర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం
- భూకంపాల నష్టంపై దాఖలైన పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు
- 'అందరినీ చంద్రుడిపైకి తరలించాలా?' అంటూ ఘాటుగా ప్రశ్నించిన ధర్మాసనం
- మన దేశాన్ని జపాన్‌తో పోల్చడం సరికాదని హితవు
- ప్రభుత్వ విధానాల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసిన కోర్టు



## రాహుల్‌గాంధీ ఒక అబద్ధాల దుకాణం

- అధికార బీజేపీ విమర్శలు
- రాహుల్‌గాంధీ తనను తాను ఒక అబద్ధాల దుకాణంగా నిరూపించుకుంటున్నారు
- కాంగ్రెస్ తీరును ఎండగడుతుంటే కాంగ్రెస్ సభ్యులు బిత్తరపోయారు

# విశాఖలో కాగ్నిజెంట్




కాగ్నిజెంట్‌తో పాటు 8 సంస్థలకు ఇవాళ భూమి పూజ చేశాం

భవిష్యత్తులో విశాఖ క్యాంపస్‌లో 1 లక్ష మంది ఉద్యోగులతో పని చేయాలి

కాగ్నిజెంట్ టెక్నాలజీస్ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపనలో సీఎం చంద్రబాబు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం**

'కాగ్నిజెంట్ టెక్నాలజీ' ఇప్పుడు విశాఖపట్నంలో అడుగు పెట్టిందని, భవిష్యత్తులో విశాఖ క్యాంపస్‌లో 1 లక్ష మంది ఉద్యోగులతో పని చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విశాఖపట్నంలో కాగ్నిజెంట్ టెక్నాలజీస్ కార్యాలయ నిర్మాణానికి సీఎం చంద్రబాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ.. ఇన్ హౌస్ కంపెనీగా ఉన్న కాగ్నిజెంట్ ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా పనిచేస్తోంది. - మిగతా3లో



## కాగ్నిజెంట్ రావడం చారిత్రాత్మక మైలురాయి

కాగ్నిజెంట్ సహా పలు ఐటీ కంపెనీల శంకుస్థాపన కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్

విజన్ వాస్తవ రూపం దాలిస్తే కాగ్నిజెంట్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు మారతాయి

2025 లో దావోస్ కలిసి కాగ్నిజెంట్‌ను విశాఖకు ఆహ్వానించాం

ఇప్పుడు మళ్లీ దావోస్ కు వెళ్లకముందే ఆ సంస్థ ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభించింది.

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం**

అంతర్జాతీయ స్థాయి దిగ్గజ ఐటీ కంపెనీ విశాఖలో అడుగుపెట్టటం చారిత్రాత్మక మైలురాయి అని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశాఖపట్నంలో శుక్రవారం కాగ్నిజెంట్ సహా 9 ఐటీ కంపెనీల శంకుస్థాపన కార్యక్రమంలో లోకేష్ పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. - మిగతా3లో

## విమాన టికెట్ల ధరలను ఏడాది పొడువునా నియంత్రించలేం

- పండుగల సమయంలో టికెట్ల ధరల పెరుగుతాయి
- ఛార్జీలపై దేశవ్యాప్తంగా పరిమితి విధించడం ఆచరణాత్మకం కాదు
- నియంత్రణ లేని మార్కెట్ కారణంగా వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుంది
- ఈ రంగం అభివృద్ధి చెందడానికి నియంత్రణ సడలింపులు జరిగాయి
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



## అల్లూరి జిల్లాలో ఘోర బస్సు ప్రమాదం

9 మంది భక్తుల మృతి

బస్సు ప్రమాద బాధితులకు పరిహారం ప్రకటించిన ప్రభుత్వం



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, చింతూరు**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోర ప్రమాదంలో 9 మంది భక్తులు మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. చింతూరు-మారేడుమల్లి ఘాట్‌రోడ్డు ప్రమాద స్థలిని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, హోం మంత్రి అనిత పరిశీలించారు. చింతూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న - మిగతా3లో




## వారికి కూడా అందుబాటులో ఓటీటీ కంటెంట్

- కేంద్రం మార్గదర్శకాలు
- వినికిడి, దృష్టి లోపం ఉన్నవారికి కూడా అందుబాటులోకి ఓటీటీ కంటెంట్
- ముసాయిదా మార్గదర్శకాలను జారీ చేసిన కేంద్రం
- ఈ నిబంధనలను రెండు దశల్లో అమలు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదన

## మహిళా అంధ క్రికెటర్ల విజయం దేశానికే గర్వకారణం



- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- ప్రపంచ కప్ విజేతగా నిలిచిన భారత మహిళల అంధుల క్రికెట్ జట్టుతో పవన్ సమావేశమై.. వారిని సత్కరించారు.
- ఒక్కో క్రికెటర్‌కు రూ.5 లక్షల చొప్పున, శిక్షకులకు రూ.2 లక్షలు చొప్పున చెక్కులు అందజేత
- ప్రతి మహిళా క్రికెటర్‌కు పట్టు చీర, శాలువాతో పాటు జ్ఞాపిక, కొండపల్లి బొమ్మలు, అరకు కాఫీతో కూడిన బహుమతులతో సత్కారం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ప్రపంచ కప్ విజేతగా నిలిచిన భారత మహిళల అంధుల క్రికెట్ జట్టుతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. ఈరోజు (శుక్రవారం) మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో క్రికెటర్లు, శిక్షకులు, సహాయక సిబ్బందితో డిప్యూటీ సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రపంచ కప్ సాధించిన క్రికెటర్లను అభినందించిన పవన్.. ఒక్కో క్రికెటర్‌కు రూ.5 లక్షల చొప్పున, శిక్షకులకు రూ.2 లక్షలు చొప్పున చెక్కులు అందించారు. ప్రతి మహిళా క్రికెటర్‌కు పట్టు చీర, శాలువాతో పాటు జ్ఞాపిక, కొండపల్లి బొమ్మలు, అరకు కాఫీతో కూడిన బహుమతులను అందించి సత్కరించారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్ మాట్లాడుతూ.. మహిళా అంధ క్రికెటర్లు సాధించిన విజయం దేశానికే గర్వకారణమన్నారు. అంధ క్రికెటర్ల ప్రాక్టీస్ - మిగతా3లో



## మరోసారి అన్నాహజారే నిరాహార దీక్ష

జనవరి 30న నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు వెల్లడి

లోకాయుక్త చట్టాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం

ప్రజా సంక్షేమానికి లోకాయుక్త ఎంతో కీలకమన్న అన్నాహజారే

## వైష్ణవి దేవి ఆలయంలో శుక్రవారం పూజలు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 12:** మండలంలోని పుదిపట్ల గ్రామంలో గల స్వయంభు శ్రీ వైష్ణవి దేవి ఆలయంలో మార్గశిర మాసం, అష్ట మి తిది, శుక్రవారం సందర్భంగా స్వయంభు శ్రీవైష్ణవి దేవికి, అభయాంజనేయ స్వామికి, నాగ భైరవ స్వామికి, ఉదయమే ఆలయఅర్చకురాలు శ్రావణి పంచామృత అభిషేకం చేసి అనం తరం అమ్మవారిని రంగు రంగు పూలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అష్టమి సందర్భంగా నాగ భైరవస్వామి సన్నిధిలో భక్తులు పంచదీపారాధనలు సమర్పించుకున్నారు. కుజ దోషం, సర్పదోషం, వివాహం కాని వారు, సంతా నం లేనివారు. అనారోగ్యంతో ఉన్నవారు నాగభైరవ స్వామికి అష్టమి రోజున పంచదీపారాధన సమర్పించు కుంటారు. చౌడేపల్లి, పుంగనూరు, మదన పల్లి,చుట్టుపక్కల గ్రామ ప్రజలు అమ్మ వారిని దర్శనం చేసుకున్నారు. హైదరాబాదు కు చెందిన శ్రీకాంత్, ధర్మపత్ని ఉమామ హేశ్వరి ఉభయదారులుగా వ్యవహరించారు. ఆల య ధర్మకర్త వినోద్ కుమార్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## రేణిగుంటలో స్క్రబ్‌టైఫస్ పై అవగాహన కార్యక్రమం



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, డిసెంబర్ 12:** రేణిగుంట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ తేజస్విని ఆదేశాల మేరకు హెల్త్ సూపర్వైజర్ కామరాజు నేతృత్వంలో తూకివాకం పంచాయతి ఎస్ ఆర్ పట్టెడ గ్రామ పాఠశాల, రేణిగుంట తపస్య ఇంగ్లీష్ మాధ్యమ పాఠశాల, వినాయకనగర్ ప్రాంతాల్లో స్క్రబ్ టైఫస్‌తో పాటుసీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.కామరాజు మాట్లా డుతూ స్క్రబ్ టైఫస్ అంటువ్యాధి కాదని, చిగ్గర్ మైట్స్ కుట్టడం ద్వారా సంక్రమిస్తుందని తెలి పారు. జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, కుట్టిన చోట పుండ్లు ప్రధాన లక్షణా లని చెప్పా రు. ఎలుకలు, పందికొక్కులు, చిట్టెలుకలను నిర్మూలించడం, ఇళ్ల చుట్టూ గడ్డి, గుబుర్లు తొల గించడం, ప్రమాద ప్రాంతాల్లో కీటకనాశినిల పిచికారీ చేయడం ద్వారా వ్యాధి నివారణ సాధ్య మని సూచించారు. సకాలంలో పరీక్షలు, వైద్య చికిత్స తీసుకుంటే ప్రమాదం ఉండదని తెలి పారు. స్క్రబ్ టైఫస్ పరీక్షలు రుయా, స్విమ్స్ ఆస్పత్రుల్లో ఉచితంగా అందుబాటులో ఉన్నా యని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పెనుమూరులో యువ నాయకుడు

## సురేష్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా



**పెనుమూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, డిసెంబర్ 12:** పెనుమూరు మండలంలోని యువ నాయకుడు సురేష్ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక కార్య క్రమాలు నిర్వహించారు. మండలం టిడిపి అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు సురేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పెనుమూరు ప్రాంతంలోని యువనాయ కులు, కార్యకర్తలు కలిసి సురేష్ బర్త్‌డేను అత్యంత గ్రాండ్‌గా నిర్వహించారు. కార్యక్రమానికి మండల అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు, పెద్దినేని కిషోర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్ర మాల భాగంగా పెనుమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేయబడింది. స్థానికనాయకులు, కార్యకర్తల సమక్షం లో ఈ కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా, ఘనంగా జరిగింది.

## రాజకీయ మహర్షి వాజపేయి కోలా ఆనంద్

### విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలని పిలుపు



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్12:** భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి మచ్చలేని నాయకుడని, ప్రజాసేవకు ప్రతీకగా నిలిచారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ పేర్కొన్నారు. రేణిగుంట ప్రెస్ క్లబ్‌లో శు క్రవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో కోలా ఆనంద్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదిగిన బీజేపీకి వాజపేయి వ్యవస్థాపకుడు అన్నారు. దేశంలో హైవే నిర్మాణ విప్లవానికి శ్రీకారం చుట్టిన మహానేత వాజ్ పేయి అన్నారు. నేషనల్ హైవే అభివృద్ధి రూపకర్తగా ఆయన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఆయన సుపరిపాలన, నైతికత, ప్రజా భద్రత పట్ల చూపిన అంకితభావం ఈతరం నాయకులకు ఆదర్శమని పేర్కొ న్నారు. ఈ నెల 14న సాయంత్రం 3 గంటలకు రేణిగుంట మర్రిగుంట ఎన్ హెచ్ కూడలి వద్ద అటల్ బిహారీ వాజపేయి కాంస్య విగ్రహ ఆవిష్కరణ, అనంతరం బహిరంగ సభను విజయవంతం చేయాలని కోలా ఆనంద్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మేళాగారం సుబ్ర మణ్యం రెడ్డి,కునాటి నాగరాజు,బాగీతి వెంకటేష్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

### సి.ఆర్.కండిగ పంచాయతీకి కొత్త భవనం ఆమోద దిశగా

## జడ్పీ సీఈఓ స్థల పరిశీలన

**పెనుమూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, డిసెంబర్ 12:**



పెనుమూరు మండలం సి.ఆర్. కండిగ పంచాయతీలో కొత్త పంచాయతీ భవనం నిర్మాణానికి ఆమోదం లభించే దిశగా చర్యలు వేగం పడుతున్నాయి. ఈ నేపథ్యంలో జడ్పీ సీఈఓ రవికు మార్ నాయుడు శుక్రవారంరోజు ప్రత్యక్షంగా స్థలపరిశీలన నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి పెనుమూరు మండల అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యా రు. పరిశీలన అనంతరం సీఈఓ మాట్లాడుతూ, ఈ ప్రాంతానికి పంచాయతీ భవనం అత్య వసరం. అవ సరమైన నివేదికలను పూర్తి చేసి, త్వరిత గతిన ఆమోద ప్రక్రియను ప్రారం భిస్తాం," అని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు భాస్కర్,చిరంజీవి రెడ్డి, దుర్గా ప్రసాద్,చిరంజీవి,గంగాధరం,రాజగోపాల్ నాయుడు,ఎరగం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

## -ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 12:** శ్రీకాళహస్తిలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో శుక్రవా రం శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గంలోని పలువురు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి దృష్టికి వారి సమస్యలను తీసుకువచ్చారు. వాటిని 15 రోజు లు లోపల పరిష్కరించవలసిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. జాతీయ హస్త కళాకారుల దినోత్సవం పురస్కరించుకొని శనివారం ఉదయం 9గంటలకు శ్రీకాళహస్తిలోని తెలుగుదే శం పార్టీ కార్యాలయంలో జాతీయ హస కళాకారుల దినోత్స వాన్ని నిర్వహించనున్నామని అని అన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి ఆంధ్రప్రదేశ్ చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉన్నారని తెలియజేశారు. శనివారం 36 మంది హస్తకళాకారులకు 33 లక్షల రూపాయల వ్యయం తో నూతన పరికరాలను అందజేయనున్నామని హస్త కళాకా రులను అభివృద్ధి చేసే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని. అందులో భాగంగా తాను శ్రీకాళహస్తిలో కేకే కలంకారి అనే పేరిట అలంకారి కేంద్రా న్ని ఏర్పాటు చేసి కలంకారి వస్త్రాలం కొనుగోలు మరింత అభివృద్ధి పరిచే విధం గా కార్యాచరణ చేపట్టనున్నామని తెలియజే శారు. శ్రీకాళ హస్తిలో కలంకారి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ఒక ఎకరా భూమిని కోరారని వాటిని ప్రభుత్వం ఇచ్చేందుకు సంసిద్ధం అయిందని. ఈ ప్రాంతం నందు హస్త కళాకారులకు భారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి, కేంద్ర ప్రభుత్వం నాలుగు కోట్ల రూపాయలు కేటాయించిం దని ఉన్నారు.శ్రీకాళహస్తిలో భారీకలంకారి కేంద్రాన్ని ఏర్పాటు చేసి కళాకారులను మరింత ప్రశ్నించే విధంగా ఇక్కడ అనే స్టాల్ లను ఏర్పాటు చేస్తామని తెలియజేశారు తెలియజేశారు.

### శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రిని

## ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 12:** శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఆసుపత్రి పైభాగాన నూతనంగా నిర్మాణమైన 50 పడకల గదులను పరిశీలించారు . నూతనంగా అత్యాధునిక పరికరాలతో రోగులకు మరింత వైద్యశాల అందించేందుకు వచ్చిన పరికరాలను పరిశీలించి అవి ఏ విధంగా రోగులకు ఉపయోగ పడతా యో ప్రభుత్వ ఆసుపత్రి ఏరియాస్ సూపర్డెంట్ అడిగి తెలుసుకున్నారు . రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించవలసిందిగా ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రిలో 150 పడకల ఆసుపత్రిగా జిల్లాలోని రెండవ అతిపెద్ద ఆసుపత్రిగా పేరుగాంచిన ఈ ఆసుపత్రికి కొన్ని వస్తువులు లేకపోవడం బాధాకరంగా ఉందని. గతంలో దాతల సహాయంతో దాదాపు కోటిన్నర రూపాయలతో కొన్ని పరికరాలను ఈ ఆసుపత్రికి అందజేశామని. ఎంజిఎం హాస్పిటల్ అధినేత మయూర్ ఈ ఆసుపత్రికి 15 లక్షల రూపాయలు విరాళంగా అందజేస్తూ ఈ ఆస్పత్రికి కావల సిన మౌలిక వసతులను ఏర్పాటు చేస్తానని చెప్పడం హర్షించదగ్గ విషయం అన్నారు.దాతలు ముందుకు వచ్చి శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి అభివృద్ధి అయి రోగులకు మెరుగైన సేవలు అందించే అందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయ కులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### భద్రాచలం సమీపంలో ఘోర రోడ్డుప్రమాదం

## 9మంది ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులు మృతి

### దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్12:** భద్రాచలం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగిం ది. ఈ యాక్సిడెంట్లో చిత్తూరు ఉమ్మడి జిల్లాకు చెందిన 9 మంది మృత్యువాత పడ్డారు. ఈ ఘటన పై న్యూఢిల్లీ పార్లమెంటు శీతాకాల సమావేశాలకు హాజరైన చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తక్షణం స్పందించారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసా రు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాల

## విద్యార్థుల విజయకేతనం



**కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 12:** కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాల యం గురువారం విడుదల చేసిన డిగ్రీ నాల్గవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిం చారని కళాశాల ప్రిన్సిపల్ వి నారాయణమూర్తి ఒక ప్రకట నలో తెలియజేశారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్‌లో మైధిలి 9.26, సింధు 9.19, ఐశ్వర్య, 9.02, గాయత్రి 9.01, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ గ్రూప్ లో అక్షయ 8.81, గంగోత్రి 8 66, అనురాధ 8.59, బీఎస్సీ బాటనీ లో ఐశ్వర్య 8.45, వనిత 8.11, త్రిష 8.03, బి ఎస్సీ జువాలజీ లో షారోన్ లిల్లీ 8.47, బి ఎ స్పెషల్ తెలుగు లో శ్రీ హర్షిత 8.42, ఎన్ ఇందు 8.06 మార్కులు సాధించి చిత్తూరు జిల్లాలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులుగా నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అధ్యాపక అధ్యాపకేతర బృందం విద్యార్థులకు అభినందనలు తెలియజే శారు. ప్రతి సెమిస్టర్‌లో ఇలాగే ఉత్తమ ఫలితాలు తీసుకువచ్చి తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని హితవు పలికారు.

### ప్రపంచ మానవ హక్కుల మండలి

## 77 వార్షికోత్సవం మహారాష్ట్ర








**ఔరంగాబాద్, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 12:** ఔరంగాబాద్ హజ్ హౌస్‌లో 'డబ్ల్యూ హెచ్‌ఆర్‌సి ప్రపంచ మానవ హక్కుల మండలి' 77వ వార్షికోత్సవ సందర్భంగా అవార్డు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమమున కు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ప్రపంచ మానవ హక్కుల మండలి కార్యవర్గ సభ్యులు ప్రముఖులు విచ్చేశారు. విద్య, వైద్య, వ్యాపార, జర్నలిజం, సోషల్ మీడియా, ప్రింట్ మీడియా, రచయితలు, ఉత్తమ విద్యార్థిని,విద్యార్థులకు,సైనికులు, పోలీ సులకు,వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన వారికి, ప్రపంచ మానవ హక్కుల కార్యవర్గ సభ్యులకు మెమొంటోలతో పాటు సర్టిఫికెట్లను మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉత్తమ బాల బాలికలకు సర్టిఫికెట్లు మెడల్స్‌ను అందజేయడం జరిగినది. జాతీయ అధ్యక్షులు అన్సారి, మాటలా దూతు మన రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులను కాపాడడంలో నేను నాతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన కార్యవర్గ సభ్యులందరు కూడా తమ వంతు పాత్ర నిర్వహిస్తారని తెలియజేశారు. అదేవిధం గా నేపాల్ దేశం నుండి వచ్చిన ప్రపంచ మానవ హక్కుల మండలి మహిళ కార్యదర్శి నీతూ కోయిరాలా హక్కుల కోసం కులం, మతం, ప్రాంతం, భాష, జాతి, రంగు, లింగ భేదాలు లేకుండా సాటి మనిషిని గౌరవించాలని ఆపదలో ఉంటే ఆదుకో వాలని తెలిపారు. సైనిక కర్నల్ నిర్దేశ్ తమ సైనికులతో విచ్చేసి మానవ హక్కు లపై దిశా నిర్దేశము సూచించారు. ప్రజల ఆపద సమయాలలో తమ ప్రతిభను కనబరిచిన సైనికులకు మెమొం టోలతో పాటు సర్టిఫికెట్లను మెడల్స్‌ను అందజే శారు. జాతీయ ఉపాధ్యక్షులు ఆన్సర్ ఉల్ హక్, మాట్లాడుతూ డాక్టర్ బాబాసా హెబ్ అంబేద్కర్ మనకు అందించిన రాజ్యాంగాన్ని కాపాడుకుం టామని, కల్పించిన హక్కులకు భంగము వాటిల్లితే తమ వంతు పాత్ర పోషించి పోరాటంసాగి స్తామని తెలిపారు. సభకు విచ్చేసి అధ్య క్షత వహించిన మాజీ జడ్జీలు ప్రభుత్వ అధికారులు హక్కుల గురించి రాజ్యాంగం గురించి సవివరంగా వివరించారు. డాక్టర్ ఫిరోజ్ ఖాన్, ప్రసంగి స్తూ మానవుని యొక్క విలువలను చక్కగా వివరించి సభను ఆకట్టుకున్నారు. ఆంధ్ర రాష్ట్రం నుంచి రాష్ట్ర అధ్యక్షులు షేక్ మస్తాన్ సాహెబ్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు అహమదుల్లా, నజీర్, జుల్ఫి కర్, అన్వర్ విష్ణు, కాంత్, అంకిపల్లి శివకుమార్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు 'అల్తాఫ్ భాయ్, దక్షిణ భారత దేశపు మీడియా కార్యదర్శి అబ్దుల్ సుభాన్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సయ్యద్ మెహతాజ్ బేగం, పర్వీన్, వనిత, రాధా మేడమ్, పుంగనూరు నగరం టీం, సభ్యులు: అస్లాం, తహీర్, రమేష్, షకీర్, నవీన్, కొత్త సభ్యులు. ప్రపంచ మానవ హక్కుల మండలి కార్యవర్గ సభ్యులు విచ్చేశారు. తదుపరి ప్రపంచ మానవ హక్కుల మండలి కార్యవర్గ సభ్యులు వివిధ రంగాలలో ప్రతిభ కనబరచిన వారందరికీ మెమొంటోలతో సర్టిఫికెట్లతో మెడల్స్‌తో సత్క రించారు. చివరగా సభ మొత్తము జాతీయ గీతమును ఆలపించి ముగించారు.

## హెల్మెట్ లేని వాహనదారుల పై ప్రత్యేక డ్రైవ్



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 12:** శ్రీకాళహస్తి తొట్టంబేడు మండలం డ్రంక్ హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న వారిపై ఆకస్మిక తనిఖీలు తొట్టంబేడు సిఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా నియమాలు ఉల్లంఘించిన 20 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తొట్టంబేడు సిఐ తిమ్మయ్య మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాలకు ముప్పు కలిగించే తీవ్రమైన తప్పిదాలు అని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను పాటించాలని వాహనదారులకు సూచించారు.

# మళ్లీ మొదటికొచ్చిన వివేకా కేసు

**కడప :** వైఎస్ వివేకా హత్య కేసు క్లైమాక్స్‌లో ట్విస్ట్ చోటు చేసుకుంది. ఒక అడుగు ముందుకు..రెండు అడుగులు వెనక్కు..ఆల్ మోస్ట్ దర్యాప్తు కంప్లీట్..అయినా ఇంకా ఎక్కడో డౌట్ అన్నట్లుగా కొనసాగుతోన్న వివేకా హత్య కేసు వివాదం ఎంతకు కొలిక్కి రావడం లేదు. వివేకా కూతురు సునీత న్యాయపోరాటం చేస్తూనే ఉన్నారు. లేటెస్ట్‌గా ఆమె లేవనెత్తిన పలు అంశాలపై దర్యాప్తునకు సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చింది. అయితే వివేకా హత్య కేసులో నిందితుల ఫోన్ కన్వర్జేషన్ కీలక ఆధారంగా మారింది.ఇప్పటికే వివేకా హత్య కేసు తొలి దర్యాప్తు అధికారి సీఐ శంకరయ్యను ఏపీ సర్కార్ డిస్మిస్ చేసింది. వివేకా హత్య జరిగినప్పుడు పులివెందుల సీఐగా ఉన్న శంకరయ్య.. సాక్ష్యాధారాలు చేరిపివేస్తున్నా చూస్తూ ఊరుకున్నారన్న ఆరోపణలను ఫేస్ చేస్తున్నారు. అయితే ఈ ఎపిసోడ్ ఇలా ఉండగానే లేటెస్ట్‌గా సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాలు ఆసక్తికరంగా మారాయి.వివేకా హత్య కేసులో ఇన్ డీటేయిల్డ్ దర్యాప్తు జరగలేదని, పలు అంశాలపై దర్యాప్తు అసంపూర్తిగా ఉందని నిందితులు చెప్తున్న విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని సీబీఐ కోర్టును కోరారు సునీతారెడ్డి. వివేకా హత్య కేసులో మిగతా దర్యాప్తు కంటిన్యూ చేయాలంటూ సునీత వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సీబీఐ కోర్టు..కీలక ఆదేశాలు ఇచ్చింది.వివేకా హత్య కేసులో కొన్ని అంశాలపై రీఇన్వెస్టిగేషన్‌కు సీబీఐ కోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు డైరెక్షన్‌లో కేసును మళ్లీ విచారించాలని వివేకా కూతురు సునీత సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు..కొన్ని అంశాలపై మాత్రం ఇన్వెస్టిగేషన్‌కు అనుమతులు ఇచ్చింది. ౦2 సునీల్ యాదవ్ బ్రదర్ కిరణ్, వైఎస్ భాస్కర్ రెడ్డి సోదరుడి కుమారుడు అర్జున్ రెడ్డి ఫోన్ సంభాషణపై దర్యాప్తు చేయాలని కోర్టు ఆదేశించింది. నెల రోజుల్లోపు దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించింది.సీబీఐ కోర్టు ఉత్తర్వులు ప్రకారం వివేకా హత్య కేసులో మళ్లీ పాక్షిక దర్యాప్తు జరగనుంది. ఆ ఇద్దరి ఫోన్ కన్వర్జేషన్‌పై దర్యాప్తునకు సీబీఐ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఈ కేసులో సునీత వ్యక్తం చేసిన అన్ని సందేశాలపై



కోర్టు విచారణకు అనుమతించలేదు. అంతేకాకుండా పాక్షిక దర్యాప్తును నెలరోజుల్లో పూర్తి చేయాలని కూడా కోర్టు చెప్పడం ఉత్కంఠ రేపుతోంది.అయితే సునీత వ్యక్తం చేస్తున్న డౌట్స్‌పై కోర్టు విచారణకు ఆదేశించకపోవడం..నిందితులకు కాస్త రిలీఫేనన్న చర్చ జరుగుతోంది. హత్య జరిగిన రోజు కడప ఎంపీ అవినాశ్ రెడ్డి ఫోన్ నుంచి వైసీపీ పెద్దలకు ముందే సమాచారం ఇచ్చి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు సునీత. ఈ విషయంపై దర్యాప్తు జరపలేదని సునీత కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రిటైర్డ్ ఐఏఎస్ అజేయ్ కల్లం తన వాంగ్మూలంలో ఉదయం 5 గంటలకు హైదరాబాద్ లోటస్ పాండ్‌లో తాము జగన్‌తో సమావేశంలో ఉండగా, భారతి నుంచి జగన్‌కు పిలుపు వచ్చిందని, ఆ తర్వాత జగన్ తమతో వివేకా మరణంపై చెప్పారని అజేయ్ కల్లాం వాంగ్మూలమిచ్చారని గుర్తు చేశారు సునీత.అయితే భారతికి ఎలా సమాచారం వచ్చింది.? ఎవరి నుంచి వచ్చిందన్న అంశంపై సీబీఐ దర్యాప్తు చేయలేదని, ఆ అంశాలపై దర్యాప్తు చేయాలని సునీత కోరారు. కేసు విచారణను సీబీఐ సగంలోనే వదిలేసిందని, నిందితులు పొంతన లేని వాంగ్మూలాలు ఇవ్వడంపైనా సీబీఐ దృష్టిపెట్టలేదని సునీత అభ్యంతరం వ్యక్తం చేశారు.అయితే కోర్టు మాత్రం సునీత లేవనెత్తిన అన్ని అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా, కేవలం అర్జున్ రెడ్డి, కిరణ్ యాదవ్ మధ్య జరిగిన ఫోన్ సంభాషణలపైనే దర్యాప్తునకు ఆదేశించింది. హత్య జరిగిన రోజు తెల్లవారుజామున 1.42 గంటల సమయంలో కిరణ్ యాదవ్ నుంచి అర్జున్ రెడ్డికి..వివేకా సర్ చనిపోయాడనే మెసేజ్ వెళ్లిందని సీబీఐ గుర్తించింది. కానీ, ఆ మెసేజ్‌పై దర్యాప్తు చేయలేదని సునీత కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పుడు కోర్టు తీర్పుతో ఈ విషయంపైనే దర్యాప్తు కొనసాగనుంది.

# లిక్కర్ కేసు... జయచంద్రారెడ్డి అరెస్ట్

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన అన్నమయ్య జిల్లా ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఎట్టకేలకు కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ భారీ కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న తెలుగుదేశం పార్టీ బహిష్కృత నేత దాసరపల్లి జయచంద్రారెడ్డిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. గత కొంతకాలంగా పరారీలో ఉన్న ఆయన్ను బెంగళూరులో అదుపులోకి తీసుకుని, విచారణ నిమిత్తం రాష్ట్రానికి తరలిస్తున్నారు. ఈ అరెస్టుతో కేసు విచారణ తుది దశకు చేరుకుందని భావిస్తున్నారు.ములకలచెరువు కేంద్రంగా సాగిన ఈ నకిలీ మద్యం దందా కేవలం ఒక చిన్న తరహా నేరం కాదు. ఇది ఒక వ్యవస్థీకృత నేరంగా ఎక్సైజ్ శాఖ గుర్తించింది. ప్రముఖ బ్రాండ్ల పేరుతో నకిలీ మద్యాన్ని తయారు చేసి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే భారీ నెట్‌వర్క్‌ను పోలీసులు ఛేదించారు. ఈ దందా వెనుక ప్రధాన సూత్రధారిగా ఉన్న అద్దేపల్లి జనార్దన్ రావుకు, జయచంద్రారెడ్డికి మధ్య ఉన్న చీకటి ఒప్పందాలే ఈ సామ్రాజ్యం విస్తరించడానికి కారణమని దర్యాప్తులో తేలింది.పోలీసుల రిమాండ్ రిపోర్ట్, ప్రాథమిక విచారణ ప్రకారం జయచంద్రారెడ్డి పాత్ర ఈ కేసులో చాలా కీలకం. నకిలీ మద్యం తయారీకి అవసరమైన భారీ పెట్టుబడిని, మౌలిక వసతులను సమకూర్చడంలో



జయచంద్రారెడ్డి ప్రధాన పాత్ర పోషించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తనకున్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించి, అధికారుల కళ్లు గప్పి ఈ దందాను నిరాటంకంగా సాగించడంలో అద్దేపల్లి జనార్దన్ రావుకు అండదండలు అందించారని పోలీసులు పేర్కొన్నారు. కేవలం పెట్టుబడికే పరిమితం కాకుండా, మద్యం తయారీ, రవాణా వ్యవహారాలన్నీ జయచంద్రారెడ్డి కనుసన్నల్లోనే సాగినట్లు రిమాండ్ రిపోర్టు స్పష్టం చేస్తోంది.జయచంద్రారెడ్డి అరెస్ట్ రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఆరోపణలు వెలుగులోకి వచ్చిన వెంటనే తెలుగుదేశం పార్టీ ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరించింది. తద్వారా అవినీతి, అక్రమాల విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని పార్టీ అధిష్టానం స్పష్టమైన సంకేతాలిచ్చింది. వాస్తవానికి ఎన్నికల ముందే జయచంద్రా రెడ్డి వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. టీడీపీ తరపున తంబళ్లపల్లె నుంచి పోటీ చేసి ఓడిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గంజాయి, నకిలీ మద్యంపై ఉక్కుపాదం మోపుతోంది. సొంత పార్టీకి చెందిన వారైనప్పటికీ, తప్పు చేస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెప్పడానికి ఈ అరెస్ట్ ఒక ఉదాహరణగా నిలుస్తుంది. ఈ కేసులో ఇప్పటివరకు 31 మందిని అరెస్ట్ చేయగా, జయచంద్రారెడ్డి అరెస్టుతో ఆ సంఖ్య 32కి చేరింది. ఆయన్ను మదనపల్లె ఎక్సైజ్ కార్యాలయానికి తరలించి లోతుగా విచారించనున్నారు.ములకలచెరువు ఘటన కేవలం ఒక ప్రాంతానికి పరిమితం కాకుండా, రాష్ట్రంలోని ఎక్సైజ్ వ్యవస్థలోని లోసుగులను, రాజకీయ నాయకుల అండతో చెలరేగిపోయే మాఫియా తీరును బయటపెట్టింది. జయచంద్రారెడ్డి అరెస్ట్ ఈ కేసులో న్యాయం జరగడానికి, భవిష్యత్తులో ఇటువంటి ప్రాణాంతక దందాలు పుట్టకుండా అడ్డుకట్ట వేయడానికి ఒక కీలక ముందడుగు. ఇప్పుడు అందరి దృష్టి మదనపల్లెలో జరగబోయే విచారణపైనే ఉంది.

# నాలుగు ఎమ్మెల్సీలకు భారీగా డిమాండ్

**విజయవాడ :** ఏపీలో టిడిపి కూటమి పాలన నడుస్తోంది. కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామిగా ఉంది. రాజకీయ పరస్పర ప్రయోజనాలు పొందుతున్నాయి టిడిపి, బిజెపి. మరోవైపు జనసేనకు సైతం ఆ రెండు పార్టీలు ఎనలేని ప్రాధాన్యమిస్తున్నాయి. ఈ తరుణంలో మూడు పార్టీలకు నామినేటెడ్ పదవులతో పాటు ఎమ్మెల్సీ పదవులు దక్కాయి. కానీ జనసేనకు రాజ్యసభ స్థానం ఇంతవరకు లభించలేదు. వచ్చే ఏడాది రాజ్యసభలో జనసేన ఖాతా తెరిచే అవకాశం ఉంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఓ నలుగురు రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. ముగ్గురు వైసీపీ రాజ్యసభ సభ్యులు కాగా.. ఒకరు టిడిపి ఎంపీ ఉన్నారు. ఈ నాలుగు ఎంపీ పదవులు ఖాళీ అవడంతో కూటమి పార్టీలు సర్దుబాటు చేసుకునే అవకాశం ఉంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పరిమళ్ నత్వాని పదవీ విరమణ చేయనున్నారు. టిడిపి నుంచి సానా సతీష్ పదవి పూర్తి కానుంది. అయితే సతీష్ మొన్ననే రాజ్యసభ సభ్యుడిగా ప్రమోట్ అయ్యారు. అది మోపిదేవి వెంకటరమణ రాజీనామాతో ఖాళీ అయిన స్థానం. దాదాపు ఏడాది కాలం మాత్రమే ఆ పదవికి గడువు ఉండగా సనా సతీష్ ని ఎంపిక చేశారు. ఇప్పుడు ఆయన కూడా పదవి విరమణ చేస్తారు. మొత్తం నాలుగు రాజ్యసభ పదవులు ఖాళీ కావడంతో కూటమి పార్టీల నుంచి విపరీతమైన పోటీ ఉంటుంది.మొత్తం నాలుగు పదవుల్లో రెండు టిడిపికి, ఒకటి బిజెపికి, మరొకటి జనసేనకు దక్కే అవకాశం ఉంది. టిడిపికి సంబంధించి కీలక నేత. ఆయనకు పదవి ఇచ్చి ఏడాది అవుతున్న క్రమంలో మరోసారి రెన్యువల్ ఖాయం. అయితే మిగిలిన ఒక రాజ్యసభ పదవికి విపరీతమైన పోటీ ఉంది. ప్రధానంగా గల్లా జయదేవ్ పేరు వినిపిస్తోంది. 2014, 2019 ఎన్నికల్లో గెలిచారు గల్లా జయదేవ్. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు క్రియాశీలక రాజకీయాలకు దూరమయ్యారు. మొన్న ఎన్నికల్లో ఆయన పోటీ చేసి ఎంపీగా గెలిచి ఉంటే కేంద్రమంత్రి కావడం ఖాయం. ఆయన స్థానంలో పోటీ చేసిన పెమ్మసాని చంద్రశేఖర్ గెలిచి కేంద్ర



మంత్రి అయ్యారు. క్రియాశీలక రాజకీయాలకు దూరమైన గల్లా జయదేవ్ టిడిపి తో అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు. రాజ్యసభకు ఎంపిక కావడం ద్వారా మరోసారి పార్లమెంట్లో అడుగు పెట్టాలని భావిస్తున్నారు.మరోవైపు పార్టీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు తన సీనియారిటీని దృష్టిలో పెట్టుకొని రాజ్యసభ పదవి కోరుతున్నారు. కొద్ది రోజుల కిందట ఆయన ఎమ్మెల్సీగా పదవి విరమణ చేశారు. ఆయన పేరు గవర్నర్ పోస్ట్ కు వినిపించింది. కానీ ఆ పదవి అశోక్ గజపతి రాజుకు వరించింది. చంద్రబాబుకు సమకాలీకుడు యనమల రామకృష్ణుడు. 1995 టీడీపీ సంక్షోభ సమయంలో స్పీకర్ గా ఉండేవారు. అప్పటినుంచి చంద్రబాబుకు నమ్మకమైన నేతగా ఉంటూ వచ్చారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారి యనమల రామకృష్ణుడుకు మంత్రి పదవి దక్కేది. 2014లో ఎమ్మెల్సీగా ఉన్న అయ్యన్నపాత్రుడుకు మంత్రిగా అవకాశం ఇచ్చారు చంద్రబాబు. కానీ ఈసారి యనమల రామకృష్ణుడు కుమార్తె దివ్య ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. ఎమ్మెల్సీగా ఉన్న యనమల పదవీ విరమణ చేసిన కొనసాగింపు దక్కలేదు. అయితే తనకు పెద్దల సభకు వెళ్లాలని ఉందని యనమల రామకృష్ణుడు పలుమార్లు వెల్లడించిన నేపథ్యంలో ఆయన పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ స్థానాలు ఆశిస్తున్న చాలామంది నేతలు ఇంకా ఉన్నారు. ప్రధానంగా పార్టీ కష్ట కాలంలో ఉన్న అధినేత చంద్రబాబు వెంట నడిచే నేతల్లో కంభంపాటి రామ్మోహన్ రావు ఒకరు. గతంలో ఆయనకు టిడిపి పలుమార్లు రాజ్యసభ పదవి ఇచ్చింది. ఈసారి కూడా ఆయన పదవిని కోరుకుంటున్నారు. మరోవైపు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కుమారుడు విజయ్ సైతం రాజ్యసభ రేసులో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సోషల్ మీడియా బాధ్యతను చూసేవారు విజయ్. అయితే వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయనని అయ్యన్నపాత్రుడు ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అయితే రాజ్యసభ పదవి ఆశిస్తున్నారు విజయ్. లేకుంటే వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి కావాలని కూడా చూస్తున్నారు. సో టీడీపీలో ఒక పదవి కోసం విపరీతమైన పోటీ కనిపిస్తుండడం విశేషం.

## విశాఖలో 'కాగ్నిజెంట్'

-మొదటిపేజీ తరువాయి

చెన్నై, హైదరాబాద్, బెంగుళూరు, కలకత్తా, పూణేలో కాగ్నిజెంట్ సంస్థ కార్యకలాపాలు ఉన్నాయి. ఇప్పుడు విశాఖకూ కాగ్నిజెంట్ అడుగుపెట్టింది. గతంలో హైదరాబాద్ లో రూపొందించిన ఎకోసిస్టంతో ఐటీ నిపుణులు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించారు. 34 బిలియన్ డాలర్ల పెట్టుబడితో కాగ్నిజెంట్ కార్యకలాపాలను ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తోంది. కాగ్నిజెంట్ లో 85 శాతం మంది భారతీయులే. ఆ సంస్థ సీఈఓ కూడా భారతీయుడే కావటం విశేషం. భవిష్యత్తులో విశాఖ క్యాంపస్ లో 1 లక్ష మంది ఉద్యోగులతో పని చేయాలని ఆకాంక్షిస్తున్నాను. 3 దశాబ్దాల క్రితం చేసిన విజన్ తోనే దిగ్గజ ఐటీ కంపెనీలకు భారతీయులు నాయకత్వం ఇస్తున్నారు. 1995లో వచ్చిన ఇంటర్నెట్ రివల్యూషన్ తో పాటు ఐటీ ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్ తీసుకున్నాం. అందుకే ఐటీకి బ్యాక్ బోన్ గా భారతీయులు నిలిచే పరిస్థితి వచ్చింది. హ్యాపెనింగ్ సిటీ విశాఖకు రావాలని కాగ్నిజెంట్ ను ఆహ్వానించాం. భవిష్యత్తులో విశాఖ క్యాంపస్ లో 1 లక్ష మంది ఉద్యోగులతో పని చేయాలని ఆకాంక్షిస్తున్నాను. త్వరలో 25 వేల మందితో పనిచేసే కేంద్రంగా కాగ్నిజెంట్ త్వరలోనే తయారు కావాలి. ఏఐ, డేటా సెంటర్లతో విశాఖ ఐటీ డెస్టినేషన్ గా నాలెడ్జి ఎకానమీ కేంద్రంగా తయారవుతోంది. భోగాపురం విమానాశ్రయం, మెట్రో లాంటి అంతర్జాతీయ స్థాయి సదుపాయాలు వస్తాయి. ప్రపంచంలోనే మోస్ట్ హ్యాపెనింగ్ సిటీగా విశాఖ రూపుదిద్దుకుంటుంది. నౌకాదళ కేంద్రం నుంచి టూరిజం కేంద్రంగా, ఇప్పుడు టెక్ సిటీగా విశాఖ ఎదిగింది. కాగ్నిజెంట్ తోపాటు 8 సంస్థలకు ఇవాళ భూమి పూజ చేశాం. గూగుల్ కూడా త్వరలోనే డేటా సెంటర్ ను ఏర్పాటు చేయబోతోంది. ఇప్పటికే విశాఖలో 150 టెక్ కంపెనీలు పనిచేస్తున్నాయి. ఈ ప్రాంతంలో నైపుణ్యం సాధించిన యువత ప్రపంచ వ్యాప్తంగా స్థిరపడ్డారు. దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే 20 శాతం జీవన వ్యయం కూడా తక్కువ. ప్రపంచంలోనే బెస్ట్ అండ్ మోస్ట్ లివబుల్ సిటిగా విశాఖను తీర్చిదిద్దుతాం. దేశంలోనే మహిళలకు అత్యంత సురక్షిత నగరం కూడా విశాఖే. 2032కి 130 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా విశాఖ ఎకనామిక్ రీజియన్ తయారవుతుంది. ఎకరా భూమి 99 పైసలకే ఐటీ కంపెనీలకు ఇవ్వటం ఓ గేమ్ ఛేంజర్ గా తయారైంది. గుజరాత్ లో టాటా నానో కారు తయారీ కేంద్రానికి కూడా 99 పైసలకే ఎకరా చొప్పున భూమి ఇచ్చారు. ఇటీవలే భాగస్వామ్య సదస్సులో 613 ఎంఓయూల ద్వారా రూ. 13.50 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అలాగే ఎస్ఐపీబీల ద్వారా మరో రూ .8.50 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం కూడా ఇచ్చేశాం. నేషనల్ క్వాంటం మిషన్ ను అందిపుచ్చుకుని ఏపీలోని అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ కేంద్రం అమరావతిలో ఏర్పాటు కాబోతోంది. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ ఐటీ కంపెనీల ప్రధాన కార్యాలయాలు కూడా విశాఖకు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రంలోని ఎలక్ట్రానిక్స్, మెడ్ టెక్ జోన్లు ప్రపంచస్థాయి ఉత్పత్తులు తయారు చేస్తున్నాయి. పరిశ్రమలకు ప్రోత్సాహకాలను ఇచ్చేందుకు ఎస్క్రో ఖాతాను పెడుతున్నాం. ఈ తరహాలో ఆలోచించే ప్రభుత్వాలు ఉండవు. ఆర్టీఐహెచ్ ద్వారా స్టార్టప్ లకు నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతున్నాం. సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులను కూడా రూపొందిస్తున్నాం . రియల్ టైమ్ గవర్నెన్సు, డేటా లేక్ ద్వారా తక్షణ నిర్ణయాలు తీసుకుంటున్నాం. రియల్ టైమ్ లోనే క్షేత్రస్థాయిలో ప్రజలకు సమాచారం అందించేలా చేస్తున్నాం. 15 శాతం వద్ధి రేటు సాధించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కషి చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఫాస్టెస్ట్ గ్రోయింగ్ కంపెనీగా కాగ్నిజెంట్ ఎదుగుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## కాగ్నిజెంట్ రావడం చారిత్రాత్మక మైలురాయి

-మొదటిపేజీ తరువాయి

విజన్ వాస్తవ రూపం దాలిస్తే కాగ్నిజెంట్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు మారతాయి. 2025 లో దావోస్ కలిసి కాగ్నిజెంట్ ను విశాఖకు ఆహ్వానించాం. ఇప్పుడు మళ్లీ దావోస్ కు వెళ్లకముందే ఆ సంస్థ ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభించింది. నూతన కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేసింది. ప్రోత్సాహకంగా ఎకరా భూమిని 99 పైసలకు ఇస్తామని వారికి హామీ ఇచ్చాం. ఆ మేరకే వారికి భూమి ఇచ్చాం. సీఎం చంద్రబాబుకు 11 నెలలు అంటే సుదీర్ఘ కాలం. ఆయనకు రియల్ టైమ్ లో నిర్ణయాలు జరగాలని ఆశిస్తారు. ఆయన కేబినెట్ లో మంత్రులందరం స్వేచ్ఛగా రాష్ట్ర అభివద్ధికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం. విశాఖపట్నం ఐటీ, జీసీసీ కేంద్రంగా మారుతుంది. విశాఖ ఎకనామిక్ రీజియన్ కూడా ఈ ప్రాంత అభివద్ధిని మారుస్తుంది. వై నాట్ వైజాగ్ అనే ప్రశ్న ఉదయించేలా ఐటీ కంపెనీలు, పరిశ్రమల్ని ఈ ప్రాంతానికి ఆహ్వానిస్తున్నాం. ఆర్సెలార్ మిట్టల్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థ ఈ ప్రాంతానికి వస్తోంది. గతంలో హైదరాబాద్ లో ఊరు చివరగా జూబ్లిహిల్స్ చెక్ పోస్టు ఉండేది. ఇప్పుడు అక్కడ చెక్ పోస్టు కాదు అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలకు ప్రతీకగా మెట్రో స్టేషన్ ఉంది. మా ముఖ్యమంత్రి ఓ జీపీఎస్, నిరంతరం అందరినీ అభివద్ధి వెంట పరుగులు పెట్టిస్తారు. రాష్ట్రంలో పెట్టిన ప్రతీ ప్రాజెక్టునూ ప్రభుత్వ ప్రాజెక్టుగా భావించి చేయూత అందిస్తామని చెప్పాం. ఇప్పుడు కాగ్నిజెంట్ కు కూడా అదే స్థాయి ప్రోత్సాహం అందిస్తాం. కాగ్నిజెంట్ లో పనిచేసే ఉద్యోగులంతా విశాఖ బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలి. 5 లక్షల ఐటీ ఉద్యోగాలు ఈ ప్రాంతానికి వచ్చేలా మా ప్రభుత్వం కషి చేస్తుంది. ప్రధాని నరేంద్ర మోదీ భారత్ ను అభివద్ధిబాటలో నడుపుతుంటే ఏపీని సీఎం చంద్రబాబు నాయుడు పురోగతి బాట పట్టిస్తున్నారని పేర్కొన్నారు.

## మహిళా అంధ క్రికెటర్ల విజయం దేశానికే గర్వకారణం

-మొదటిపేజీ తరువాయి

కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని.. అన్ని విధాలా అండగా నిలవాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. మహిళా క్రికెటర్లు తెలిపిన అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ప్రపంచ కప్ గెలిచిన జట్టులో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణులు దీపిక (జట్టు కెప్టెన్), పాంగి కరుణా కుమారి ఉండటం సంతోషంగా ఉందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఇక ఈ సమావేశంలో భాగంగా జట్టు కెప్టెన్ దీపిక తమ గ్రామ సమస్యలను ఉపముఖ్యమంత్రికి దృష్టికి తీసుకెళ్లారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం కావాలని దీపిక విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన పవన్.. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన క్రికెటర్ కరుణ కుమారి చేసిన విజ్ఞప్తులపైనా తక్షణమే చర్యలు ప్రారంభించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారు.

## అల్లూరి జిల్లాలో ఘోర బస్సు ప్రమాదం

-మొదటిపేజీ తరువాయి

క్షతగాత్రులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు, క్షతగాత్రులకు రూ.2లక్షల పరిహారం ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన వారికి అందుతున్న వైద్య సేవలపై మంత్రి ఆరా తీశారు. మంత్రి వెంట స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, జిల్లా సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్, ఇతర అధికారులు ఉన్నారు. భద్రాచలంలో ఆలయాన్ని దర్శించుకొని తిరిగి అన్నవరం వెళ్తుండగా ఘటన చోటు చేసుకుంది. ఘాట్ రోడ్డు, పొగమంచు, డ్రైవర్ అకస్మాత్తుగా స్టీరింగ్‌పై నియంత్రణ కోల్పోవడం వంటి అంశాలు ప్రమాదానికి కారణమై ఉండొచ్చని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

## విశాఖలో రాందేవ్ వెల్నెస్ హబ్

**విశాఖపట్టణం :** యోగా గురువు బాబా రామ్‌దేవ్ నేతృత్వంలోని పతంజలి గ్రూప్ ఆంధ్రప్రదేశ్‌లో ఒక ప్రధాన ప్రాజెక్ట్‌ను ప్రారంభించనుంది. రాష్ట్రంలో దాదాపు ?118 కోట్ల పెట్టుబడితో ఒక గొప్ప వెల్నెస్ హబ్‌ను ఏర్పాటు చేయడానికి పతంజలి గ్రూప్ ప్లాన్ చేస్తోంది. ఈ వెల్నెస్ హబ్ విశాఖపట్నం (విశాఖ) లోని యెండడా ప్రాంతంలో నిర్మించనుందని తెలుస్తోంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త పర్యాటక వ్యూహం కింద ఈ ప్రాజెక్ట్ చాలా ముఖ్యమైనదిగా పరిగణిస్తున్నారు. ఏపీ ప్రభుత్వం ఇటీవల ఆరోగ్యం, ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ కొత్త చొరవ కింద పతంజలి సంస్థ తమ వెల్నెస్ హబ్ రాష్ట్రంలో మొదటి ప్రైవేట్ ప్రాజెక్ట్ అవుతుంది.ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం ఏమిటంటే ప్రజలకు ఆరోగ్యం, ఆధ్యాత్మికత రెండింటినీ కలిపి అందించడం. సహజ ప్రకృతి సౌందర్యం, బీచ్‌లకు ప్రసిద్ధి చెందిన విశాఖపట్నం వెల్నెస్ పర్యాటకానికి అనువైన ప్రదేశం అని పతంజలి భావించింది. ఈ హబ్ యోగా, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యం వంటి సౌకర్యాలను అందిస్తుంది.

మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

# 63 వేల సంతకాలా...?

ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 12:**
కుప్పం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, పీకేఎం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, టిటిడి బోర్డు సభ్యుడు శాంతారాం కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ... కుప్పంలో ఎక్కడా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ జరగలేదని, కుప్పం నియోజకవర్గంలో 63 వేల మంది సంతకాలు పెట్టారని ఎమ్మెల్సీ భరత్ చెప్పడం హాస్యాస్పదం అని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా మెడి కల్ కాలేజీలను పీపీపీ మోడల్‌లో స్థాపించడం ప్రభుత్వ విధానమని అన్నారు. 2024 కు ముందు జరిగిన పనులతో పోలిస్తే 2025 నుండి కుప్పం అభివృద్ధి పరుగులు పెడుతోందని, నియోజకవర్గంలోని అన్ని చెరువులను నింపేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అధికారం చేపట్టిన 15 నెలల్లో హంద్రీనీవా ప్రాజెక్టు పూర్తి చేసిన ఘనత సీఎం చంద్రబాబుదే అని తెలిపారు. అలాగే రాబోయే రెండు ఏళ్లలో కుప్పం నియోజకవర్గంలో 30 నుంచి 40 వేల ఉద్యోగాలు రాబోతున్నాయని వెల్లడించారు. గత ఐదేళ్లలో కుప్పం నియోజకవర్గంలో విచ్చలవిడిగా గ్రానైట్ అక్రమ రవాణా జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆలయాల అభివృద్ధికి సీఎం చంద్రబాబు 54 కోట్ల రూపాయలను మంజూరు చేశారని తెలిపారు. 11 ఆలయాల్లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, అవసరమైన గ్రానైట్‌ను స్థానిక క్వారీల నుంచే తెస్తున్నామని చెప్పారు. దీనిని ఆసరాగా తీసుకుని ఆలయాల అభివృద్ధి పేరుతో అక్రమ రవాణా చేస్తే ఎవరినీ వదిలి పెట్టమని హెచ్చరించారు. అనంతరం టిటిడి బోర్డు సభ్యులు శాంతారామ్ కూడా ఎమ్మెల్సీ భరత్‌ను తీవ్రంగా విమర్శించారు. కుప్పంలో మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 63 వేల సంతకాలు పెట్టారనే విషయం రుజువు చేస్తే నేను టిటిడి బోర్డు సభ్యత్వానికి రాజీనామా చేస్తాను. రుజువు చేయలేకపోతే ఎమ్మెల్సీ భరత్ తన పదవికి రాజీనామా చేస్తారా అని ప్రశ్నిస్తూ సవాల్ విసిరారు. అదే విధంగా సీఎం పై నోటికి వచ్చినట్లు మాట్లాడితే కుప్పంలో అడుగుపెట్టకుండా చేస్తామని, ఇప్పటికైనా వైసీపీ నేతలు అవాస్తవాలు మానుకోవాలి అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులుబాబు నాయుడు, సుబ్బు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు 430 ఫోన్లు పంపిణీ



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 12:**
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కుప్పం పట్టణం లోని కడా కార్యాలయంలో కుప్పం నియోజకవర్గంలోని అంగన్వాడీలకు 430 మొబైల్ ఫోన్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.. అంగన్వాడీలలో ప్రభుత్వ సేవలకు ఉపయోగపడేలా ఈ మొబైల్ ఫోన్లను అంగన్వాడీ కార్యకర్తలకు పంపిణీ చేయడం జరిగిందని కంచర్ల శ్రీకాంత్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డా. వి.ఎం. థామస్ నేతృత్వంలో

## నేడు ఎస్ఆర్‌పురం జాబ్ మేళా

**పెనుమూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, డిసెంబర్12:**
ఎస్ఆర్‌పురం మండలంలో నేడు జరగబోయే భారీ జాబ్ మేళా యువతకు ఉద్యోగ అవకాశాల దిశగా కీలక వేదిక కానుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,గంగా ధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం.థామస్ ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహించబడనున్నట్లు పెనుమూరు మండల అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు తెలిపారు. రుద్రయ్య నాయుడు పిలుపునిస్తూ,"పెనుమూరు మండలంలోని ప్రతినిరుద్యోగ యువకుడు యువతి రేపు 13వ తేదీన ఎస్ఆర్‌పురం జాబ్ మేళాకు తప్పక హాజరుకావాలి. ఇలాంటి అవకాశాలు తరచుగా రావు. ఒక మంచి ఉద్యోగం అంటే ఒక కుటుంబ భవిష్యత్తు మెరుగుపడినట్టే, "అని అన్నారు. నిరుద్యోగం తగ్గితే కుటుంబాల్లో ఆర్థిక భారం తగ్గుతుంది. ఉద్యోగాలు లేక చెడు అలవాట్ల వైపు వెళ్లే యువత, ఈ అవకాశంతో మంచి దిశగా ఎదగాలి. మన యువత కోసం ఇంత పెద్ద స్థాయిలో అవకాశాలను తీసుకొస్తున్న మన ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు," అన్నారు. పెనుమూరు మండలంలోని నిరుద్యోగులు ఈ జాబ్ మేళాను పూర్తిగా ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

## చైర్మన్ అవినాష్ రెడ్డి



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 12:**
అన్నమయ్యజిల్లా పీలేరు ఎంజెఆర్ కళాశాలలో జెనరేటివ్ AI పై ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని కళాశాల చైర్మన్ అవినాష్ కుమార్ రెడ్డి,తెలిపారు. కంపెనీ ప్రతినిధు లైన సాయి లక్ష్మణ్, రాజేష్, బాలాజీల అధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రపంచంలో వచ్చిన మార్పులు రాబోయే రోజుల్లో జరగబోయే పరిణామాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి నరసింహా రావు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ కుప్పం వారియర్స్ ఆధ్వర్యంలో

# మెగా బ్లడ్ క్యాంప్



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 12:**
లయన్స్ క్లబ్ ఆఫ్ కుప్పం వారియర్స్, కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వారు సంయుక్తంగా నిర్వహించిన మెగా బ్లడ్ క్యాంపుకు దాతల నుంచి మంచి ఆదరణ వచ్చిందని, లయన్స్ క్లబ్ అడ్వైసర్ మహేష్ అంబా తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తం యొక్క అవశ్యకత ఉందని తెలుసుకున్న లయన్స్ క్లబ్ సభ్యులు ఆసుపత్రి యాజమాన్యంతో కలిసి, ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కుప్పం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ వైస్ ఛైర్పర్సన్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ... ఈ రక్తదాన శిబిరంలో ప్రత్యేకంగా యువత మరీ ముఖ్యంగా వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొనడం, అభినందించిదగ్గ విషయం అంటూ యువతను సేవ, బాధ్యత, బంధుత్వం, మొదలగు సద్గుణాల వైపు ప్రయాణింపజేస్తే దానికన్నా మరో ఉన్నతమైన సమాజం ఉండదని తెలిపారు. యువతను, విద్యార్థులను రక్తదానం చేయుటకు ప్రోత్సహించిన లియో క్లబ్ మెంబర్ అనిల్ నాయక్ ను మెడికల్ సూపర్డెంట్ ప్రత్యేకంగా అభినం దించారు. ఈ కార్యక్రమంలో డా.విశ్వనాథ్ ఐఎంఎస్, డా. శ్యామలాదేవి, ఆర్ఎంఓ డా.హరిప్రియ,వారి సిబ్బంది,లయన్స్ క్లబ్ ఆఫ్ కుప్పం వారియర్స్ ప్రెసిడెంట్ డా. సుదర్శన్,సెక్రటరీ శివ తేవర్,వైస్ ప్రెసిడెంట్ సెల్వం,డైరెక్టర్ సెంథిల్ కుమార్, సతీష్ మొదలగు సభ్యులు పాల్గొన్నారు.

సరస్వతి విగ్రహప్రతిష్ట కార్యక్రమంలో

## పాల్గొన్న టిడిపి నాయకులు



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 12:**
వెదురుకుప్పం మండలం అగ్గిచేనుపల్లి స్కూల్లో సరస్వతి విగ్రహప్రతిష్ట కార్య క్రమంలో వెదురుకుప్పం టిడిపి మండల అధ్యక్షులు మోహన మురళి, సరస్వతి విగ్రహ దాత శివకుమార్, భూపాల్, మొగ రాల. శివ, అగ్గిచేనుపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్య రెడ్డి, ప్రధాన కార్యదర్శి బుజ్జిబాబు ఏఎంసి డైరెక్టర్ బాలాజీరెడ్డి, మారేపల్లి బూత్ కమిటీ కన్వీనర్ వెంకటరమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరిధర్ రెడ్డి, అగ్గిజేను పల్లి యూత్ కార్తీక్ వెంకటేష్, నరేష్,దీనకర్, నవీన్,నాగరాజు,రాజేష్,ప్రశాంత్, సురేష్, గురు, సంతోష్,ఏకంబరం తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం రోడ్డు ప్రమాదం చాలా బాధాకరం



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 12:**
భద్రాచలంనుంచి అన్నవరానికి యాత్రికు లతో వెళ్తున్న ప్రైవేట్ బస్సు అల్లూరి సీతా రామరాజు జిల్లాలోని చింతూరు-మారేడు మిల్లి ఘాట్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదం చాలా బాధాకరమని పలమ నేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఈ ఘోరమైన ప్రమాదంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన 9 మంది మృత్యువాత పడడమే గాక అందులో పలమనేరుకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఉండడం చాలా విషాద కరమని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. విజయవాడలో జరుగుతున్న ప్రత్యేక సమావేశాలకు హాజరైన ఆయన ఈ ఘటనపై తక్షణం స్పందించారు. రోడ్డు ప్రమాదానికి గురైన బాధితుల వివరాల ను స్థానిక అధికారులను అడిగి తెలుసు కొని వారికి అవసమైన సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఇక ప్రమాదంలో అసువులు బాసిన మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పలమనేరుకు చెందిన శివశంకర్ రెడ్డి, సునంద రెడ్డిలు ప్రమాదం లో మృతి చెందిన విషయం తెలిసి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించిందని ప్రమాదంపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా ఆయన భరోసానిచ్చారు.

సదుం మండలం ఎన్నికల అబ్జర్వర్‌గా

## ఏఎంసీ చైర్మన్ డైరెక్టర్.



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,డిసెంబర్ 12:**
అన్నమయ్య జిల్లా పీలేరు మండలానికి చెందిన ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి ఏ.ఎం.సి డైరెక్టర్ గోళ్ల కిషోర్ నాయుడుని హైకమాండ్ సదుంమండలం ఎన్నికల అబ్జర్వర్గా నియమించారు. పార్టీఆదేశాను సారం సదుంమండలంలోని చెరుకువారిపల్లి తిమ్మనాయనపల్లి జోగివారిపల్లి గ్రామాలలో శుక్రవారం పర్యటించి స్థానిక నాయకులతో చర్చించి వారి సమస్యలు సమస్యలు తెలుసుకున్నారు. పార్టీ కోసం కృషి చేయాలని గ్రామస్తులకు భరోసా కల్పించారు.

# సంపాదకీయం

## ఇండిగో గుత్తాధిపత్యంపై

# మళ్లీ ప్రశ్నలు

ఇటీవల ఇండిగో విమానాల సంఘటన భారతదేశంలో ప్రపంచీకరణ, పెట్టుబడిదారీ వర్గం పాలక వ్యవస్థల పనితీరుపై అనేక ప్రశ్నలను మరోసారి లేవనెత్తింది. గత దశాబ్దాలలో ప్రయాణీకులు ఇలాంటి అస్తవ్యస్తమైన పరిస్థితిని ఎప్పుడూ ఎదుర్కోలేదు. లగేజీ కౌంటర్లలో లగేజీని అప్పగించిన తర్వాత కూడా ఫ్లైట్లు రద్దు కావడం, ఆపై ప్రయాణీకు లకు తమ లగేజీ దొరక్కపోవడం లాంటి సంఘటనలు ప్రజలకు నోట్ల రద్దు నాటి అస్తవ్యస్తతను మరోసారి గుర్తు చేశాయి. ఎక్కడి వారు అక్కడే గప్చుప్ అయ్యే పరిస్థితి దాపురించింది. ఇది కేవలం ఒక్క విమాన సంస్థ వైఫల్యం అని గానీ, ప్రస్తుత పాలకవర్గం గత విధానాలపై నింద వేసి తప్పించుకు నేంత తేలికైన సమస్య కాదు. ఒక్క నవంబర్లోనే దాదాపు 900 కంటే ఎక్కువ విమానాలను ఇండిగో రద్దు చేసింది. ఆ తర్వాత డిసెంబర్ 6న 1600 ఫ్లైట్లు, డిసెంబర్ 7న 850 ఫ్లైట్లను రద్దు చేయడం చూస్తే, ఇంతటి అధిక స్థాయిలో సర్వీస్ లోపాలు, నియంత్రణలో వైఫల్యాలు భారత ప్రజలు గతంలో ఎప్పుడూ విన్నది లేదు. సాధారణ ప్రజలు, మధ్యతరగతి ఇప్పటికే భారతీయ రైల్వేలపై ఆశలు వదులుకున్నారు. గత బాలసోర్ రైలు సంఘటన గాయం ఇంకా ప్రజల జ్ఞాపకాల నుండి చెరిగి పోలేదు. రైల్వే సేవలలో నాణ్యతా ప్రమాణాలు అత్యంత దిగువ స్థాయిలో ఉన్నాయనేది ప్రయాణీకులందరికీ అనుభ వమే. ఒక్కొక్క సేవను కార్పొరేట్ కాంట్రాక్టుల గుప్పెట్లో పెట్టిన తర్వాత రైల్వే సేవలు మరింత దారుణంగా మారి పోయాయి. రైలు బోగీల్లో కంపుకొట్టే దుర్గంధాన్ని భరించక తప్పని పరిస్థితి. దానికి తోడు గంటల కొద్దీ రైళ్ల ఆలస్యం వర్ణనాతీతం. తక్కువ జీతాలు తెచ్చుకునే కార్మికులకు రైల్వే తప్ప మరో మార్గం లేదు.. ఈ విపత్కర సంధి దశలో మధ్యతరగతి ప్రజలు, కాస్త ఎక్కువ డబ్బులు ఇచ్చి అయినా సరే, విమాన సేవల్ని కొనుగోలు చేయాలని ఆశించారు. ఒకప్పుడు ధనిక వర్గానికి మాత్రమే పరిమితమైన విమాన ప్రయాణాన్ని, ఇండిగో వంటి కంపెనీలు చవకగా అందించడంతో, రైల్వేలపై అసంతృప్తితో ఉన్న మధ్యతరగతి వర్గం విమానాలపై ఆధారపడటం మొదలుపెట్టింది. సరిగ్గా ఇదే సమయంలో, ఇలాంటి వర్గంతో భారతదేశంలో వ్యాపారం చేసి భారీ లాభాలను ఆర్జించవచ్చని భావించిన ఇండిగోకు మార్గం సుగమం అయింది. ఈ రెండు అంశాలు కలసి ఇండిగోకు గోల్డెన్ ఏజ్ను అందించాయి.. 1990లో ప్రారంభమైన ప్రపంచీకరణతో, పాలకవర్గాలు దేశ ఆర్థిక విధానాలను పెట్టుబడిదారీ వర్గానికి అనుకూలంగా మార్చడం మొదలుపెట్టాయి. ఇటీవల అది వేగం అందుకుంది. ఇటీవల ఎల్ఐసీ తన నిధుల్ని భారీగా ఒక ప్రత్యేక కంపెనీ బాండ్ల కొనుగోలులో వినియోగించిందనే చర్చ కొనసాగుతుంది. అయితే ఎల్ఐసీ ఆ విమర్శను తిప్పి కొట్టినప్పటికీ, ప్రజల మెదళ్లలో సందేహాలు లేకపోలేదు. జియో ఉచిత సేవలతో టెలిఫోన్ రంగం ఒకటి రెండు సంస్థల చేతుల్లోకి వెళ్లినట్టుగానే, 'పెద్ద చేప చిన్న చేపను తినేసే' గుత్తాధిపత్యం ప్రతి రంగంలోనూ మొదలైంది. చివరకు లేబర్ కోడ్లలో మార్పులతో మొత్తం పారిశ్రామిక వాతావరణం కూడా పెట్టుబడిదారీ వర్గానికి అనుకూలంగా మారబోతోంది. శ్రమ దోపిడీ ఏ స్థాయిలో కొనసాగించినా సరే, శ్రామికుడిని 12 గంటలు పని స్థలాల్లో పనిచేయించినా సరే సమ్మెలను అంగీకరించేది లేదనే పరిస్థితి మెల్లమెల్లగా శిలాశాసనం కాబోతుందా? అనే ప్రశ్న కార్మికుల్లో మెదులుతూనే ఉంది.. నేడు విమాన సేవల్లో దాదాపు 60 శాతం మార్కెట్ను ఒక్క ఇండిగో ఆక్రమించింది. విరామం లేకుండా రైళ్లను నడిపే పైలట్ల మాదిరిగానే, లాభాల వేటలో విమాన సర్వీస్ల లో కూడా పైలట్లకు సరైన విరామం కలిగించకుండా కార్పొరేట్లు సేవలందిస్తున్నట్టు తెలుస్తోంది. అందుకే ప్రభుత్వ సంస్థలు పైలట్లకు సరైన విరామం కలిగించడానికీ, ఇతర సేవల్లో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మార్పులు చేయడానికీ ప్రయత్నించడం హర్షించదగ్గ విషయం. అయితే, ఈ మార్పులకై కంపెనీలకు సంవత్సరం కంటే ఎక్కువ సమయం ఇచ్చినప్పటికీ, వారు ఆ సర్వీసులను అందించలేకపోవడం, దాంతో పాటు బుకింగ్లను తీసుకుంటూ ప్రయాణికులను ఇబ్బంది పెట్టడం ఏ మాత్రం సమంజసం కాదు. సర్వీస్ అందించలేని పరిస్థితుల్లో బుకింగ్లను తీసుకోకూడదు. ఒకవేళ తీసుకున్నా, కనీసం రెండు రోజుల ముందు అయినా సరే రద్దు వార్తలను ప్రయాణికులకు అందించి ఉంటే, ఎయిర్పోర్ట్లో లగేజీలు జమ అయిన తర్వాత ఫ్లైట్లు అందకపోయే దారుణమైన పరిస్థితి తప్పేది. ధనవంతులు, మధ్యతరగతి వర్గం ప్రయాణం చేసే విమానాల పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నప్పుడు, రైల్వేల వంటి సాధారణ ప్రజలు ప్రయాణించే సంస్థలనైనా, పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు, లేదా పబ్లిక్ సెక్టార్ ఇన్సూరెన్స్ కంపెనీలనైనా ఇలాంటి ప్రైవేటు సంస్థలకు పూర్తిగా అప్పగిస్తే, పరిస్థితులు ఇంకా ఎంత దారుణంగా ఉంటాయో ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఏ సర్వీసైనా ప్రైవేటీకరణ అయిన వెంటనే అది ఉన్నతంగా మారిపోతుందని నాయకులు భారత ప్రజల చెవుల్లో పూలు పెడుతుంటారు. భజనలో కూరుకుపోయిన కొంత భాగం మధ్యతరగతి వర్గం కూడా ఇదే భావించడం చూస్తున్నాం. కానీ, అది అన్ని వేళలా నిజం కాదని ఈరోజు ఇండిగో సంఘటన బహిర్గతం చేసింది. ప్రభుత్వాలను సైతం శాసించగలిగే స్థాయికి ఇలాంటి గుత్తాధిపత్య సంస్థలు రాకముందే, ప్రభుత్వాలు ప్రజల కోణంలో ఆలోచించి, ప్రజలకు పనికొచ్చే ఆర్థిక విధానాలు అవలంబించగలిగితేనే, ఇలాంటి విపత్కర పరిణామాల నుండి ప్రజలకు విముక్తి లభిస్తుంది.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143